ప్రజాశక్తి
సోమవారం 17 ఏప్రిల్ 2023   8 పేజీలు


గుంటూరు


పల్నాడు

వినిపించని రైలు కూత

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో అసంపూర్తిగా మొదటి దశ పనులు - పూర్తవ్వని న్యూ పిడుగురాళ్ల జంక్షన్



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో మొదటి దశ పనులు పూర్తికాకపోవడం వల్ల నడికుడి-శావల్యాపురం మార్గంలో రైళ్ల రాకపోకలు ఇంకా ప్రారంభం కాలేదు. ట్రాక్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. న్యూ పిడుగురాళ్లను జంక్షన్ ఏర్పాటు చేసినా ఇందుకు సంబంధించిన సాంకేతిక పనులు పూర్తికాకపోవడం, శావల్యాపురం వద్ద గుంటూరు, గుంతకల్లు మార్గానికి పూర్తి స్థాయిలో అనుసంధాన నిర్మాణ పనులు జరగకపోవడం వల్ల రైళ్ల రాకపోకలకు ఇంకా పచ్చజెండా ఊపలేదని రైల్వే వర్గాలు తెలిపాయి.

పనులు ప్రారంభించి ఆరేళ్లు గడిచినా నూతన రైల్వే లైను మొదటి దశ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. ట్రాక్ నిర్మాణంతోపాటు విద్యుద్దీకరణ పనులు కూడా చేపట్టాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. 2022 డిసెంబరు నాటికి పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం మధ్య రైళ్ల రాకపోకలను ప్రారంభించాలని ప్రణాళిక రూపొందించినా ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఈ మార్గంలో ఏడాది క్రితమే ట్రయిల్ రన్ వేశారు. కానీ ఇంకా కొన్ని పనులు ఆగిపోవడం వల్ల హైదరాబాద్ రైల్వేలైను నుంచి నంధ్యాల లైనుకు అనుసంధానం జరగలేదు. ఈ ట్రాక్ నిర్మాణం మొత్తం పూర్తయితే హైదరాబాద్ నుంచి కూడా రైళ్లు నేరుగా తిరుపతికి వెళ్లే అవకాశం ఉంది.

2017లో నడికుడి-శ్రీకాళహస్తి మధ్య 308 కిలో మీటర్ల మేరకు ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. తొలిదశ పనులు పిడుగురాళ్ల నుంచి శావల్యాపురం వరకు 47 కిలో మీటర్ల మేరకు ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టారు. 2లో


పెసర పంటను ఆరబెట్టుకుంటున్న రైతు

ధర ఎగుడు దిగుడు

ప్రజాశక్తి - దుగ్గిరాల

సాగు ప్రారంభంలో ధరలను ఊరించిన దళారులు, వ్యాపారులు అనంతరం పంట చేతికి వచ్చిన తర్వాత రైతులను ఉసూరు మనిపిస్తున్నారు. పెసర మార్కెట్ ఒడిదుడుకులతో రైతులు తీవ్ర ఆందోళన, గందరగోళానికీ గురవుతున్నారు.

దుగ్గిరాల మండలంలోని ఎక్కువగా రెండో పంటగా మినుము, మొక్కజొన్న సాగవగా పెనుమూలిలోని పడమర ప్రాంతంలో మాత్రం నీటి సదుపాయం కొరత కారణంగా పెసర ఎక్కువగా సాగైంది. ఈ గ్రామం పరిధిలో సుమారు 3 వేల ఎకరాల సాగు భూమి ఉండగా ఇందులో దాదాపు 500 ఎకరాల్లో ఈ ఏడాది మినుము సాగైంది. రెండు వారాల కిందట పంట నూర్పిళ్లు 2లో

గుండెపోటుతో హాస్టల్ విద్యార్థి మృతి

బాలికపై కానిస్టేబుల్ అత్యాచారం


వార్తలు మెయిన్‌లో

సాహస కలెక్టర్

కొండవీడు కొండపై పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ట్రెక్కింగ్

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని కొండవీడు కోటలో శనివారం రాత్రి బస చేసిన పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదివారం ఉదయం కొండవద్దే ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నిద్ర లేవగానే వ్యాయామ చేయడంతోపాటు యోగాసనాలు వేశారు. ట్రెక్కింగ్, రాక్ క్లైమ్బింగ్ కార్యక్రమాల్లో పాల్గొని అందర్నీ ఆశ్చర్యపరిచారు. అటవీ శాఖ - అవుట్ రైవల్ అడ్వెంచర్ టీమ్‌తో కలిసి కొండవీడు కోట చట్టు పక్కల ప్రాంతాల్లో పర్యటించారు. కొండవీడును మరింత అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలు, ఆర్థిక పరిస్థితులపై స్థానిక అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖాధికారి రామచంద్రరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు మరింత విస్తృతం

ఇంటర్వ్యూ

- సిగ్నల్ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు
- సెల్ టవర్లను పెంచుతాం
- ప్రజాశక్తితో బిఎస్ఎన్ఎల్ జీఎం శ్రీధర్

8లో



నరసరావుపేటలో ప్రచారంలో మారుతివరప్రసాద్, గుంటూరు విజయ్‌కుమార్ తదితరులు

4లో

రాజ్యాంగాన్నే మార్చేదిశగా బిజెపి అడుగులు

ప్రచారభేరీలో సిపిఎం, సిపిఐ నాయకులు - కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై కొనసాగుతున్న ప్రచారం



గుంటూరులో మాట్లాడుతున్న పాశం రామారావు, వేదికపై జంగాల అజయ్‌కుమార్ తదితరులు

5లో


నృత్యం చేస్తున్న నృత్య కళాకారులు

అలరించిన సూపర్ మస్తీ

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తెనాలిలో సూపర్ మస్తీ ఆట పాటల షో ప్రేక్షకులను సందడి చేసింది. ఆదివారం తెనాలి మార్కెట్ యార్డులో కుమార్ పంప్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సూపర్ మస్తీ కార్యక్రమంలో వర్ధమాన గాయకులు తమ గళాన్ని ప్రేక్షకులకు వినిపించారు. ప్రముఖ టివి యాంకర్ సుమ కనకాల వ్యాఖ్యాతగా వ్యవహరించి ఆద్యంతం ప్రేక్షకులను అలరించారు. ముందుగా కార్యక్రమ నిర్వాహకులు కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం వారి కుటుంబసభ్యులు, డబుల్ హార్స్ మినపగుళ్ల అధినేత మునగాల శ్యామ్ ప్రసాద్ చేతులమీదుగా యాంకర్ సుమ జ్యోతి ప్రకాశనం చేయించారు. వర్ధమాన సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, ధనుంజయ్, మాళవిక, దామిని, సాకేత్, లిప్సిక, వర్ష తమ స్వరాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. నృత్య కళాకారులు తమ నృత్యాలతో అలరించారు.

ధర ఎగుడు దిగుడు

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైన తొలిరోజుల్లో క్వింటాళ్ పెసర ధర రూ.7,300 ఉండగా అనంతరం అనేక హెచ్చుతగ్గులకు గురవుతోంది. నూర్పిళ్లు మొదలైన వారానికే ధర రూ.6,700కు పడిపోయింది. ఒకదశలో రూ.6,300 వరకూ తగ్గింది. అయితే క్రమంగా మళ్లీ పెరుగుతూ గత శనివారం రూ.6,900కు, ఆదివారం రూ.7,200కు చేరింది.

ధరలో ఎగుడుదిగుడులను గమనిస్తున్న రైతులు తమ పంటను అమ్ముకోవాలో లేదో అర్థంకాక సతమతమవుతున్నారు. దీనికితోడు ఎక్కువ మంది రైతులకు నిల్వ సదుపాయాలు లేని కారణంగా ఎప్పటికప్పుడు ఉన్న ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. పంట నిల్వ చేస్తే తరుగుదల వస్తుందనే ఆందోళన ఇందుకు మరోకారణం.

ఎకరా పెసర సాగుకు రూ.10 వేల వరకూ ఖర్చవుతుంది. విత్తనాల కొనుగోలు, తెగుళ్ల బారి నుండి పైరును కాపాడుకోవడానికి మందులు వేయడమే పెసర సాగులో ప్రధాన ఖర్చు. నీటి తడులు ఎక్కువగా అవసరం ఉంది. ఒకటి రెండుసార్లు అందిస్తే సరిపోతుంది. సాధారణంగా వర్షమే ఆధారంగా ఈ పంటను రైతులు సాగుచేస్తుంటారు. అయితే ఈ ఏడాది సరైన వానల్లేక పంట దిగుబడులు తగ్గాయి. సాధారణంగా ఎకరాకు ఐదారు క్వింటాళ్ల వరకూ దిగుబడి ఉంటుంది. అయితే ప్రస్తుతం సగటున మూడున్నర క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. రెండో పంటపై ఆశలు పెట్టుకుని సాగులోకి దిగిన రైతులు ఇప్పుడు దిగుబడి తగ్గడంతో నిరాశకు గురయ్యారు. మరోవైపు ధరలు ఎప్పుడు ఎలా ఉంటాయో తెలియక కంగారు పడుతున్నారు.

మోటార్ వాహన సవరణ చట్టంపై పోరాడాలి


మాట్లాడుతున్న నన్నపనేని శివాజీ

ప్రజాశక్తి-గుంటూరు

మోటారు వాహనాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ మొత్తంలో పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని 15 ఏళ్లు దాటిన వాహనాలు తీసివేయాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని జరిగే పోరాటాలలో రవాణా రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆటో వర్కర్స్ యూనియన్ నగర సమావేశం వేముల శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ మోటారు వెహికల్ సవరణ చట్టం-2019ని కేంద్రంలో ప్రభుత్వ ఆమోదించాక, రాష్ట్రంలో జీవో నెంబర్ 21 ద్వారా అన్ని రకాల చలానాలు జరిమానాలు పెంచి, రవాణా రంగాన్ని ప్రభుత్వం ఆదాయంగా భావించి సంక్షోభంలోకి నెట్టాయని విమర్శించారు. గ్రీన్ ట్యాక్స్ విపరీతంగా పెంచడం, ఇన్సూరెన్స్ రోడ్డు టాక్స్, టోల్గేట్ 15శాతం పెంచడం గుదిబండగా మారాయని అన్నారు. రాష్ట్రంలో సంక్షోభంలో ఉన్న రవాణా రంగంపై నూతనంగా 30శాతం రోడ్‌టాక్స్ పెంచడం ఈ రంగాన్ని మరింత దెబ్బతీయటమేనని అన్నారు. ఎప్పటికీ టోల్‌ట్యాక్సు, రోడ్డు ట్యాక్సు, అధిక పెనాల్టీలు గ్రీన్ టాక్స్ మోటర్ వాహనచట్ట సవరణ ఫైన్లతో బాడుగలు లేక, కిస్తీలు చెల్లించలేక సంక్షోభంలో కూరుకు పోతుందన్నారు. అలాగే ఉన్న రవాణా రంగంపై 15 ఏళ్లు దాటిన వాహనాలు తీసివేయాలని కేంద్రం నిర్ణయం వల్ల దేశంలో కోట్లాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులతో పాటు ఇతర అన్ని రంగాల కార్మికులను కలుపుకొని భవిష్యత్తులో ఐక్య పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌కె. మస్తాన్ వలి, నగర ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి గండికోట శంకర్ తదితరులు మాట్లాడారు. అనంతరం హిందూ కళాశాల వద్ద ఉన్న ఆటో స్టాండ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన గౌరవాధ్యక్షులుగా అంకాల వెంకటేశ్వర్లు, అధ్యక్షులు కారసాల ఏడుకొండలు, ప్రధాన కార్యదర్శి కూరగంటి సంపత్ కుమార్, ఉపాధ్యక్షులు పల్లెపాగు సాల్మన్, సహాయ కార్యదర్శి గుంజి కొండలరావు, కోశాధికారి బత్తుల విజయ్, కమిటీ సభ్యులు బి రాజేష్ ఓ శ్రీను, జి.పవన్, ఎస్‌కె.మస్తాన్వలి, ఎం అర్జున్‌రావు తదితరులను ఎన్నుకున్నారు.

'రాజకీయాల్లో ఈశ్వరరావు సేవలు ఆదర్శనీయం'


ఈశ్వరరావును సత్కరిస్తున్న వక్తలు, తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి:రాజకీయాల్లో నీతి, నిజాయితీగా పనిచేసి వివాదాలకు దూరంగా ఉంటూ అందరికి ఆదర్శంగా ఉన్నవ్యక్తి డిసిసి అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావు అని పలువురు కొనియాడారు. లయన్ నూతలపాటి వీర ప్రకాశరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్రప్రభు ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ఎన్‌జివో కల్యాణ మండటపంలో ఈశ్వరరరావు రాజకీయరంగ స్వర్ణోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా ఆయన్ను పలువురు ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్‌లో ఉంటూ ఇందిరాగాంధీ కుటుంబానికి విధేయుడై పెద్దలు దూరమైనప్పటికీ వెన్నంట నిలిచి 1978-82 మధ్యకాలంలో ఎమ్మెల్యేగా. ప్రభుత్వ విప్‌గా పనిచేసి గుంటూరు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఒక్క గుంటూరు నియోజకవర్గంలో 20వేల మంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు ,అలాగే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థలను తీసుకువచ్చారంటూ కొనియాడారు.తులసి రామచంద్ర ప్రభు ఆధ్వర్యంలో రజిత కిరీటంతో సన్మానించారు. పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఆ పార్టీ నేతలు షేక్ మస్తాన్ వలి, వణుకూరి శ్రీనివాసరెడ్డి, షేక్ ఉస్మాన్, కొరివి వినయ్ కుమార్, ఆకుల శ్రీనివాస్, కొలనుకొండ శివాజీ, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, మానవ హక్కుల కమిషన్ రిటైర్డు చైర్మన్ చైర్మన్ కాకుమాను పెద పేరిరెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ జిల్లాకార్యదర్శి జంగాల అజయ్ కుమార్, వైసిపి నాయకులు మాదారాధ, జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి, వివిధ పార్టీల నాయకులు అంబటి రత్తయ్య, సయ్యద్ సుబాని,చేన్నంశెట్టి సాంబశివరావు, సుధీర్ బాబు, అడ్వకేట్ శ్రీనివాస్,అంకమ్మ చౌదరి, ఎం.శ్రీనివాస్,ఉ. సీతారామయ్య, డి.రాము, ఎస్. రోహిత్, కె.రాధా కృష్ణమూర్తి, కెవి.నగేష్,కెహెచ్.బెంజిమెన్ కలిసి ఘనంగా సన్మానించారు. ఈశ్వరరావు మాట్లాడుతూ సన్మానం చేసినందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.






వినిపించని రైలు కూత

(మొదటి పేజీ తరువాయి)

పిడుగురాళ్ల-రొంపిచర్ల మధ్య ఒక ఆర్‌యూబీ, మరో ఆర్‌వోబి పనులు పూర్తి అయ్యాయి. నకరికల్లు వద్ద కొండను తొలచి పనులు చేపట్టారు. బెల్లంకొండ బ్రాంచి కెనాల్, గుంటూరు బ్రాంచి కెనాల్‌పై వంతెనలు నిర్మించారు. పిడుగురాళ్ల-శావల్యాపురం మధ్య 47 కిలో మీటర్ల పరిధిలో నూతన రైల్వే స్టేషన్లు, ఫ్లాట్ ఫారాలు, క్యాబిన్లు నిర్మాణం కూడా పూర్తయ్యాయి. ఆయా ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థ ఎలక్ట్రికల్ పనులు చేపట్టారు. పిడుగరాళ్ల నుంచి నెల్లూరు జిల్లా వెంకటగిరి వరకూ రైల్వే ట్రాక్ నిర్మాణం జరగాల్సి ఉంది. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిర్మాణం కోసం రూ.3250 కోట్లు అంచనాలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు మొత్తం వ్యయం కేంద్రం భరించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించింది.

పల్నాడు, గుంటూరు జిల్లాలో భూ సేకరణ సమస్య కూడా పరిష్కారమైంది. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో మెట్ట ప్రాంత వాసులకు ఇప్పటి వరకూ రైల్వే సౌకర్యం లేకపోవడంతో కేంద్ర ప్రభుత్వం 2017లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి పనులు ప్రారంభం కాగా ఆరేళు ్లగా మొదటి దశ పనులు కూడా పూర్తి చేసి రైళ్లను నడపలేకపోయారు. కొన్ని సమయాల్లో హైదరాబాద్ నుంచి గూడ్స రైళ్లు వస్తున్నాయి. ప్రస్తుతం ప్రకాశం జిల్లా పరిధిలో రెండో దశ పనులు జరుగుతున్నాయి. మొదటిదశలో గుంతకల్లు, గుంటూరుకు ట్రాక్‌కు అనుసంధానం చేయడం ద్వారా దక్షిణ, ఉత్తర భారతదేశంలోని రాష్ట్రాలకు రాకపోకలకు అవకాశం ఏర్పడనుంది.


రావి రంగారావుకు సాహిత్య పురస్కారాన్ని అందచేస్తున్న సాహితీవేత్తలు

కాల కాలుష్యాన్ని కడిగేసిన కందుకూరి

ప్రజాశక్తి-గుంటూరు

తరతరాల కాలుష్యం కడిగేసిన ధన్యజీవి కందుకూరి వీరేశలింగం అని ప్రముఖ సాహితీవేత్త కంచర్ల విజయ భాస్కర్ అన్నారు. స్థానిక బ్రాడీపేట ఎస్‌హెచ్‌ఒలో ఆదివారం 'అమరావతి సాహితీమిత్రులు' నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని కందుకూరి జయంతి సందర్భంగా ఆయన సాహిత్యంపై ప్రసంగించారు. కందుకూరి మరణించి నూరేళ్ళు గడచినా ఆయన ఆశయాలు నేటివరకు చాలా నెరవేరలేదని అయన ఆవేదన చెందారు. స్త్రీ వివక్ష, అవినీతి నేటికీ పోలేదన్నారు. ఈ మాసం కవిగా రేపాక రఘునందన్ పాల్గొని వివిధ స్వీయ కవితలను వినిపించారు. రేపాక రచన 'పైడిమర్రి జీవిత చరిత్ర' గ్రంధాన్ని డాక్టర్ రమణ యశస్వి ఆవిష్కరించగా పింగళి భాగ్యలక్ష్మి సమీక్షించారు. ఆంధ్రజ్యోతి వార పత్రిక పూర్వ సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ సోదరి పేరుతొ ఏర్పాటు చేసిన 'బులుసు సీతాకుమారి ఫౌండేషన్ పక్షాన 'ప్రమిద' పత్రిక సంపాదకులు బులుసు కామేశ్వరరావు 2022 జీవన సాఫల్య సాహిత్య పురస్కారాన్ని డాక్టర్ రావి రంగారావుకు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సూర్యదేవర రవికుమార్, ప్రముఖ సాహిత్య పరిశోధకులు డాక్టర్ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, డాక్టర్ సేవాకుమార్ పాల్గొన్నారు.


ఇఫ్తార్‌విందును ప్రారంభిస్తున్న మేయర్, తులసీ ధర్మచరణ్ తదితరులు

పెదపలకలూరులో ఇఫ్తారు విందు

ప్రజాశక్తి-గుంటూరు:రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి దర్మచరణ్ అన్నారు. ఆదివారం పెదపలకలూరు గ్రామంలో కారసాని వెంకట్ (నాని) ఇంటి వద్ద నిర్వహించిన ఇఫ్తార్ విందుకు తులసి ధర్మచరణ్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలసి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం ఇఫ్తారు విందును వడ్డించారు. క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని పేర్కొన్నారు. కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఆకలి ఎంత కఠినంగా ఉంటుందో స్వయంగా అనుభవిస్తే తప్ప అనుభవంలోకి రాదనే భావనతో రంజాన్ ఉపవాసదీక్షలు అని తెలియజేశారు. కార్యక్రమంలో డేగల ప్రభాకర్, పి. శ్రీనివాసరావు, పి.గోపాలకష్ణ, పెద్దలు, ముస్లిం యువత భారీగా ఇఫ్తారు విందులో పాల్గొన్నారు.

ఫ్లూ వ్యాధిపట్ల అప్రమత్తంగా ఉండాలి


అవగాహన సభలో మాట్లాడుతున్న డాక్టర్ నీరెన్

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల కాలంలో దేశంలో విస్తరిస్తున్న ఫ్లూ వ్యాధి పెద్దలలో ఎక్కువగా కనిపిస్తుందని, ప్రాణాంతకమైన ఈ ఫ్లూ పట్ల అప్రమత్తంగా ఉండాలని, సంవత్సరానికోసారి ఫ్లూ వ్యాక్సిన్ వేయించుకోవాలని రమేష్ హాస్పిటల్స్ ఇన్‌ఫెక్షన్ వ్యాధి నిపుణులు డాక్టర్ నీరెన్ రావెల అన్నారు. ఆదివారం అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులు ఈమని కృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ నీరెన్ మాట్లాడుతూ ఫ్లూ వ్యాధి కొద్దిపాటి నొప్పులతో ప్రారంభమై, తలనొప్పి, గొంతునొప్పి, చలిలక్షణాలు కనిపిస్తాయన్నారు. తర్వాత జ్వరం, దగ్గు, కీళ్ళ నొప్పులు పెరిగిపోతాయన్నారు. వేయి ముఖాలున్న రాక్షసిగా పిలవబడే ఫ్లూ పాలిటబడిన వారికి అది తగ్గిపోయేదాకా నరకయాతన అనుభవించాల్సిందేనని అన్నారు. ఫ్లూ వచ్చినప్పుడు యాంటీబయాటిక్స్ తీసుకొని లాభం లేదని, కావున డాక్టర్ల సలహాతో వేరే మందులు, వ్యాక్సిన్లు ఉపయోగించాల్సిందేనని అన్నారు. ఫ్లూ అంటువ్యాధి కాబట్టి ఇంట్లోనే ఉండాలన్నారు. విశ్రాంతి తీసుకోవటం వల్ల శరీరంలోని శక్తిని ఇన్‌ఫెక్షన్‌తో పోరాడటానికి వినియోగించుకుంటుందన్నారు. వ్యాక్సిన్లు ఏ ఏడాది వచ్చినవి ఆ ఏడాదే వేయించుకోవాలన్నారు. వ్యాక్సిన్ల వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం డాక్టర్ నీరెన్‌ను అవగాహన సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సాయిరాం, కిలారి రాజన్‌బాబు, నారాయణ, శివశంకరరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి హత్యకు గురయ్యాడా?

- పోలీసుల అదుపులో అనుమానిత వ్యక్తులు
- కృష్ణా నదిలో గాలింపు





ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఈ నెల 12వ తేదీన ఇంటి నుండి బయలుదేరి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 13వ తేదీన అదృశ్యమైనట్లు వెల్దుర్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సం బంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దుర్తి మండలం కొత్త పుల్లారెడ్డిగూడెంకు చెందిన గన్నెబోయిన లింగయ్య ఇంటి నుండి ఈ నెల 12వ తేదీన బయలు దేరాడు. తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీ సులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే, లింగయ్య దగ్గర అప్పు తీసుకున్న వాళ్లే హత మార్చి ఉంటారని బంధువులు ఆరో పిస్తున్నారు. ఈ మేరకు విచారణ చేపట్టగా లింగయ్య తో బాగా చనువు గా ఉండే మద్ది వెంకటేశ్వర్లు మొన్నటి వరకు కొత్త పుల్లారెడ్డి గూడెం గ్రామ పొలాలకు కాపలా ఉండే వాడు. వారం క్రితం దుర్గి మండలం కోలగుట్ల వద్ద పొలాలకు కాపలాగా ఉం డేందుకు కుదిరాడు. అతని ద్వారా లింగయ్య వద్ద లక్షల్లో అప్పులు తీసుకున్న కొత్త పుల్లారెడ్డి గూడెంకు చెందిన కొందరు వ్యక్తులు నమ్మకంగా లింగయ్యను కోలగోట్లకు పిలి పించి ఆ ప్రాంతంలో హత్య చేసి, మృత దేహాన్ని కేపి గూడెం సమీపంలోని కృష్ణా నదిలో పడవేసినట్లు అనుమానం రావడంతో ఆదివారం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

దీనిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయంపై కొందరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

మాతంగి రత్నకిషోర్‌కు నివాళులు

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల మరణించిన విశ్రాంత ఉద్యోగి, సిపిఎం సీనియర్ నాయకులు మాతంగి రత్న కిషోర్ సంస్మరణ సభ ఆదివారం రూరల్ గ్రామం కంచర్లపాలెంలో నిర్వహించారు.కోపల్లె సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ 1970 కాలంలో సిపిఎం తెనాలి తాలూకా నాయకులుగా పనిచేసిన రతనకిషోర్ ,పేదలకు నివేశన స్థలాలు, శ్మశానాలకు భూములు సాధించడంలో కృషి చేశారన్నారు. ఉద్యోగిగా ఏలూరులో పని చేసిన కాలంలో మద్య తరగతి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులుగా కూడా పనిచేశారని చెప్పారు. గతంలో గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసి కేవలం 30 ఓట్ల తేడాతో ఓటమి చెందారని అన్నారు. సిపిఎం ఉద్యమ కార్యాచరణలోనూ ఆయన చురుకైన పాత్ర పోషించారని సాంబిరెడ్డి కొనియాడారు. మాజీ సర్పంచ్ చుక్కపల్లి ప్రభాకర్ రావు, టిడిపి నాయకులు కె. శ్రీనివాసరావు, రత్నకిషోర్ కుటుంబసభ్యులు అజయ్ కుమార్, సిహెచ్ శేషగిరిరావు ఎన్ రాజ్యలక్ష్మి, ఎం సాంబశివరావు, పి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి



సుబ్బయ్యపాలెంలో సుబాబుల్ పంట దగ్ధం

ప్రజాశక్తి-రొంపిచర్ల

మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామంలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆ గ్రామ పరిధిలో గల హైవే రోడ్డు పక్కన ఉన్న గాడిపర్తి సీతయ్య కు చెందిన పొలం నుండి తపెద్ద ఎత్తున మంటలు ఎగిసి పడ్డాయి. అక్కడ ఉన్న రైతులు మంటలు అర్పేందుకు తీవ్ర ప్రయత్నాలు చేశారు. లఈ సమాచారం తెలుసుకున్న నరసరావుపేట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అర్పివేశారు.ఈ ప్రమాదంలో సీతయ్య పొలంలో సాగు చేస్తున్న సుబాబుల్ పంట స్వల్పంగా దగ్ధమైంది.

కొత్తపేటలో బైక్ చోరీ



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేటలో ఓ యువకుడు ఆదివారం దర్జాగా బైక్ చోరీ చేసిన ఘటన చోటు చేసుకుంది. సదరు యువకుడు తెల్ల షర్టు ధరించి ఉన్నాడు. సదరు యువకుడు దొంగతనం చేసే సమయంలో సిసి కెమెరాలో రికార్డ్ అయ్యాతలయి. సమాచారం తెలిసిన యెడల పట్టణ పోలీసులకు సమాచారం తెలియజేయాలని పోలీతసులు కోరారు.



సిఎం ఫ్లెక్సీల చింపివేత

ప్రజాశక్తి-తాడేపల్లి

గుంటూరు జిల్లా సీతానగరంలోని సిఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లే మార్గంలో జగన్ ఫ్లెక్సీ లను గుర్తుతెలియన వ్యక్తులు చింపేశారు. రంజాన్ పండుగ పురస్కరించుకుని ముస్లింలు ఈ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దుండగులు వీటిని బ్లేడుతో కోసివేశారు.

మూడు రాజధానులు నచ్చకే వైసిపికి దూరం

డిసిసిబి మాజీ డైరెక్టర్ వరప్రసాద్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మూడు రాజధానుల విధానం నచ్చకే తాను గత రెండేళ్లుగా వైసిపికి దూరంగా ఉంటున్నానని సెంట్రల్ బ్యాంకు మాజీ డైరక్టర్ ఎన్.వి.ఎస్.వర ప్రసాద్ (బుజ్జి) పేర్కొన్నారు. గుంటూరులోని చంద్రమౌళినగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ తాను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు రెండు రోజుల క్రితం వైసిపి నుంచి బహిష్కరిస్తున్నట్టు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి లేఖ ద్వారా ప్రకటించారని తెలిపారు. తాను టిడిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్నానని తనను వైసిపి నుండి బహిష్కరించడం విడ్డూరంగా ఉందన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకర్ రావు సూచనతోనే నన్ను బహిష్కరించారని వర ప్రసాద్ తెలిపారు. తాను ఎప్పుడైనా టిడిపి కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు నిరూపించుకోగలరా అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే శంకరరావు అన్న కొడుకు నంబూరు రవి టిడిపిలో కొనసాగుతూ జై చంద్రబాబు అనలేదా అని ప్రశ్నించారు. అతన్ని ఎందుకు సస్పెండ్ చేయలేదన్నారు. షోకాజ్ నోటీసు ఇవ్వకుండా బహిష్కరించడం నిబంధనలకు విరుద్ధం అన్నారు. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ భోజనానికి పిలిస్తే వెళ్ళానని అంతేతప్ప తాను ఎక్కడా టిడిపి కార్యక్రమాల్లో పాల్గొనలేదన్నారు. ఎన్నికల్లో వైసిపి గెలుపునకు కృషి చేశానని అయితే రాజధాని విషయంలో ప్రభుత్వ తీరు నచ్చక తాను పార్టీకి దూరంగా ఉంటున్నానని అన్నారు. రాజధాని రైతులను నమ్మించి మోసం చేయడం తగదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



కొండలరావును సత్కరిస్తున్న కళాకారులు

తెలుగు నాటక రంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-తెనాలి

నాలుగు దశాబ్దాలుగా తెలుగు నాటక రంగానికి విశేష సేవలు అందిస్తూ కళా రంగానికి తన జీవితాన్ని అంకితం చేసిన ప్రముఖ రంగస్థల కళాకారులు కటారి కొండలరావు ఎందరికో ఆదర్శమని పట్టణ రంగస్థలం కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికిపాటి సుబ్బారావు అన్నారు. తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ఉప్పు బజార్ లో వంగవీటి రాధా రంగ స్మారక కాపు యువజన సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుబ్బారావు మాట్లాడుతూ తెలుగులో తొలి నాటక రచయిత, దర్శకులు కందుకూరి వీరేశలింగం జయంతిని పురస్కరించుకొని తెలుగు నాటక రంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. సేవాసమితి అధ్యక్షులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో సీనియర్ కళాకారులు కటారి కొండలరావును ఘనంగా సత్కరించారు. సన్మాన గ్రహీత కొండలరావు మాట్లాడుతూ కొడిగడుతున్న తెలుగు నాటక రంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కళాకారులను ప్రభుత్వాలు విస్మరించినా కొన్ని సంస్థలు ముందుకొచ్చి కళాకారులను గౌరవించడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వాలు, సామాజిక సేవా సంస్థలు కళాకారులను ఆదుకుని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. అనంతరం కటారి కొండలరావును, యువ కళాకారుడు దీపాల తారక సాయినాథ్ ను సేవా సమితి సభ్యులు కళాకారులు ఘనంగా సత్కరించారు.



పెనుమాకలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లి

పెనుమాకలో కళ్ళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయి టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్ ఈరోజు మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ పట్ల ఆదరణ పెరుగుతుందని అన్నారు. ఈ టోర్నమెంటూ క్రీడా కారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు దోహద పడుతుందని అన్నారు. ఈ పోటీల్లో 50 టీములు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ టోర్నమెంట్ నిర్వ హిస్తున్న కళ్లం పౌండేషన్ వారిని అభినందించారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహు మతి లక్ష రూపాయలు,రెండో బహుమతి 50 వేలు మూడో బహుమతి 25 వేలు ఇవ్వడం జరుగుతుం దని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు కళ్ళం శివగోవింద రెడ్డి, కళ్ళం రాజ శేఖర్ రెడ్డి, కళ్ళం మహేష్ రెడ్డి, కళ్ళం కరుణకర్ రెడ్డి, కళ్ళం బాబు, కళ్ళం భాస్కర్ రెడ్డి, భీమవరపు సురేంద్ర రెడ్డి,కళ్ళం శ్రీనివాసరెడ్డి, ఎవియస్, ఉడుముల వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.



రవికుమార్‌కు అంబేద్కర్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

నల్గొండకు చెందిన పుడమి సాహితి వేదిక మహ నీయుల జయంతోత్సవాల సందర్భంగా అందజేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మారక పురస్కారాన్ని సత్తెనపల్లికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్ అందుకున్నారు. విభిన్న పౌరాణిక పాత్రలు పోషించి, రెండు రాష్ట్రాల ప్రేక్షకులను రంజింపచేసినందుకు గాను ఆయనకు ఈ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా రవి కుమార్‌ని సత్తెనపల్లిలోని వివిధ కళా సంస్థల అధినేతలు, కార్యదర్శులు, మిత్రులు అభినందించారు.అంబేడ్కర్ స్మారక పురస్కారాలు 20 మందిని, బాబూ జగజ్జీవనరామ్ పురస్కారాలు 15 మందికి మరియు జ్యోతిరావు పూలే పురస్కారాలు 11 మందికి ప్రధానం చేశారు. ఈ పురస్కారాలను ఉపాధ్యాయులు, భరతనాట్య ప్రవీణులు, సాంఘీక సేవా రంగాలు, రైతు సేవా రంగాలు, కళా రంగాలలో నిష్ణాతులైన వారిని రెండు రాష్ట్రాల స్థాయిలో ఎంపిక చేసి ప్రధానం చేశారు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వివిధ ప్రదేశాల్లో మందుబాబులు బహిరంగంగా మద్యం సేవి స్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఆ ప్రాంతాల్లో తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు బహి రంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, చట్టపరమైన శిక్షలు తప్పవని హెచ్చరించారు.



చిలకలూరిపేటలోని కళామందిర్ సెంటర్‌లో టాప్ లేని బస్సు షెల్టర్

నీడ లేదు.. షెల్టర్ల జాడా లేదు!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగు తోంది. పట్టణంలో ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరింది. ఇంట్లో ఉన్నా వేడి భరించలేని పరిస్థితి ఉంటోంది. ఇక, పనుల నిమి త్తం సమీప గ్రామాల నుంచి పట్టణానికి వచ్చి తిరిగి ఆర్టీసీ బస్సుల్లో వెళ్లే వారి పరిస్థితి మరిదారుణంగా ఉంది. ఎందుకంటే, పట్టణంలోని ప్రధాన సెంటర్లలో బస్సు షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడు తున్నారు.ముఖ్యంగా నరసరావుపేట సెంటర్, పురుషోత్త పట్నం అడ్డరోడ్డు సెంటర్, విశ్వనాథ సెంటర్ వద్ద , జాతీయ రహదారి పక్కన బస్సు షెల్టర్ల నిర్మాణం జరగ లేదు. కళామందిర్ సెంటర్ వద్ద కొన్నేళ్లుగా బస్సు షెల్టర్ కు పైకప్పే లేదు. బస్‌షెల్టర్లు లేకపోవడంతో చెట్ల కింద, టీ స్టాల్స్ ముందు, బడ్డీ కొట్ల ముందు, సోడా బండ్ల పక్కన నిలబడి బస్సుల కోసం వారు వేచి చూసే పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల బస్సు షెల్టర్లు ఉన్నా అవి ఆక్ర మణలకు గురయ్యాయి. ఈ విషయమై ప్రశ్నించే నాథుడే లేడు. కొన్నిచోట్ల రోడ్ల విస్తరణ పేరుతో ఉన్న షెల్టర్లను తొలగించారు. గత్యంతరం లేక ఆయా దుకాణాల ముందు ముఖ్యంగా శీతలపానీయాలు విక్రయించ వాటి ముందు నిలబడ్డ వారు ఏదైనా డ్రింక్ తాగితే ఉన్న ధర పై ఒకటో, రెండో రూపాయలు ఎక్కువే చెల్లించాల్సి వస్తోంది. గతంలో వేసవి వచ్చిందంటే పట్టణంలో పలు చోట్ల తాటాకు పందిళ్లు వేసి తాగునీటి కుండలు ఏర్పాటు చేసేవారు. ధర్మ చలివేంద్రాలూ ఉండేవి. వాటికి మున్సి పాలిటి నిధులతో తాగునీటిని సరఫరా చేసే వారు. ముఖ్యంగా కొన్ని స్వచ్ఛంద సంస్థలు ప్రయాణికులకు పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసేవారు. ప్రస్తుతం అవి ఎక్కడా కనబడట్లేదు. గత నాలుగేళ్లుగా అటువంటి ఏర్పా ట్లు ఏమీ లేవు. ఇప్పటికైనా స్థానిక మున్సిపల్ అధి.కారులు, ఆర్టీసీ వారు పూనుకొని తాత్కాలిక షెల్టర్లు, మూత్రశాలలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నర్సరావుపేట బస్సులు ఆగే వద్ద ఎండలోనే నిల్చున్న ప్రయాణికులు

ఐక్య కార్యాచరణ వల్లే సాగునీటి విడుదల

- అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు
- కుడి కాల్వకు కనీసం 25 రోజులపాటు నీరు సరఫరా చేయాలని డిమాండ్



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి - నరసరావుపేట

ప్రతిపక్ష పార్టీల ఐక్య కార్యాచరణ వల్లే ప్రభుత్వం నాగార్జున సాగర్ కుడికాలువకు నీరు విడుదల చేసిందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ప్రతిపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ సిపిఎం, సిపిఐ, జనసేన, టిడిపి కార్యకర్తలు నాయకులు కలిసి వైసిపి దుర్మార్గాలకు, అవినీతి పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామన్నారు. నాగార్జునసాగర్ కుడి కాలువకు నీళ్ల విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు,రైతు సంఘ నాయకులతో కలిసి ప్రతిపక్ష పార్టీలు పోరాటం చేశాయన్నారు. టిడిపి నేత డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఇటీవల కురిసిన అకాల వర్షాల చేతికి అంది వచ్చిన వరి, మొక్కజొన్న,మిర్చి పంటలు పూర్తిగా నష్టపోయిన రైతులు పెట్టుబడిరాక ఇబ్బంది పడుతున్నారన్నారు.

మళ్లీ పంటలు వేసుకుని రైతులు నష్టాన్ని పూడ్చు కోవ డానికి నెల రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు నాగార్జునసాగర్ కుడికాలువకు నీళ్లు ఇచ్చి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అంద జేశామన్నారు. ప్రభుత్వం ప్రతిపక్ష పోరాటాలకు స్పందించి కుడి కాలువకు నీళ్లు విడుదల చేయడం ఇది ప్రతిపక్షాలు , రైతులు సాధించిన విజయమన్నారు. పంటలకు ఆరుతడులు అందే విధంగా మే నెల చివరి వరకు నీరు ఇస్తే, రైతులు వేసిన పంటలు చేతికి అందివస్తాయని, నెల రోజులు నీళ్ల ఇస్తే ఎండిపోయిన చెరువులను రైతులు నింపుకుంటారన్నారు.

సిపిఐ నాయకుడు కాసా రాంబాబు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడి కాలువకు నీరు విడుదల కోసం వివిధ రూపాల్లో నిరసన తెలియజేశామన్నారు. కుడికాలువ నీటి విడుదల కోరుతూ ఉద్యమించిన నాయకులను అరెస్టు చేయడాన్ని ఆయన తప్పు బట్టారు. కుడి కాలువ నీటి సమస్య పరిష్కారానికి రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశా మన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నీటిని విడుదల చేస్తామని ప్రకటించడం ప్రతిపక్ష పార్టీలు సాధించిన విజయంగా అభివర్ణించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రకటనను స్వాగతి స్తున్నామని, కనీసం 25 రోజులు కుడి కాలువ ద్వారా నీటిని అందించి రైతాం గాన్ని ఆదుకోవా లని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పులిమి రామిరెడ్డి, మాబు, హనుమ ప్రసాద్, సైద వలి, వెంకట్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

నరసరావుపేటలో ప్రచారభేరిలో నాయకులు

ప్రజాశక్తి-నరసరావుపేట

దేశంలో బిజెపి పాలనతో ప్రజా స్వామ్యం ప్రమాదంలో పడిందని, ఉద్యో గులకు, రైతులకు, మహిళలకు ఎటువంటి భద్రత లేకుండాపోయిందని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక,నిరంకుశ విధానాలకు నిరసనగా సిపిఎం, సిపిఐ తలపెట్టిన ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక వెంగళరెడ్డి నగర్‌లో ఆయా పార్టీల నాయకులు పర్యటించారు.

ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రానికి మోడీ ప్రభు త్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంతా కాద న్నారు. పార్లమెంటు సాక్షిగా విభజన చట్ట ంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని అన్నారు. ఈ విషయమై వైసిపి, టిడిపి, జనసేనలు స్పందించడం లేదని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అంతా కలిసి నడుం బిగించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రైల్వే, ఇన్సూ రెన్స్, ఎయిర్ ఇండియా, బ్యాంకులను కాపాడుకోవాలని, విశాఖ ఉక్కును రక్షించుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. ప్రజలపై భారాలు మోపుతూ, దేశ సంపదలను కార్పొరేట్లకు కట్టబెడుతున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలంతా పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. సిపిఎం జిల్లా కమిటి సభ్యులు ఏపూరి గోపాలరావు మాట్లా డుతూ కార్పొరేట్లకు తొత్తుగా ప్రధాని మోడీ వ్యవహరిస్తున్నారని బిజెపికి బుద్ది చెప్పేం దుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మారుతి వర ప్రసాద్ మాట్లాడుతూ సామాన్యప్రజల రక్షణే ధ్యేయంగా వ్యవహరిం చాల్సిన ప్రధాని మోడీ, కార్పొరేట్లకు కొమ్ముకాయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, ఎస్.ఆంజనేయనాయక్, నాయకులు సుభాష్ చంద్రబోస్, హుస్సేన్, రబ్బానీ, సుభాని, ఫాతిమా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, సిపిఐ నియోజక వర్గ కమిటీ సభ్యులు యు.రంగయ్య, పట్టణ కార్యదర్శి వి.వెంకట్ పాల్గొన్నారు.



'గీతమ్స్'లో నవోదయ మోడల్ టెస్ట్

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక గీతమ్స్ హైస్కూల్‌లో ఆదివారం నవోదయ మోడల్ టెస్ట్ నిర్వహించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థినీ, విద్యార్థులు 150 మంది హాజరయ్యారు. పరీక్ష అనంతరం ఫైనల్ పరీక్షలో ఎక్కువ మార్కులు సాధించుట కోసం అవసరమైన మెలకువలను, సమయ పాలన గురించి, పరీక్షకు ఎలా ప్రిపేర్ అవ్వాలో సలహాలు,సూచనలు చేశారు. మోడల్ టెస్ట్ నిర్వహించడంపై పలు వురు విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు తక్షణ సాయం ఇవ్వండి

- బాధిత కుటుంబాలను సంక్షేమ బోర్డు ఆదుకోవాలి
- కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగమివ్వాలి: సిఐటియు
- రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి



భవన నిర్మాణ కార్మికుల మృతదేహాలను సందర్శించిన సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-నరసరావుపేట

ప్రమాదవశాత్తు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందిన భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు తక్షణ ఆర్థిక సాయం కింద రూ.5 లక్షలు మంజూరు చేయాలని పల్నాడు జిల్లా భవన,ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి సిలార్ మసూద్, సిఐటియు పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజ నేయులు నాయక్‌లు డిమాండ్ చేశారు. తక్షణసాయంతో పాటు పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి రావాల్సిన సంక్షేమ పథకాలు అందజేసి వారిని ఆదుకోవాలని అన్నారు. పల్నాడు రోడ్డులోని ఏరియా ఆస్పత్రి శవాగారంలో ఉన్న భవన నిర్మాణ కార్మికులు గుడి వెంకయ్య, నూతంగి అబ్రహం మృతదేహాలను ఆదివారం వారు సందర్శించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నుండి, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి వారికి రావాల్సిన సంక్షేమ పథ కాలను వెంటనే అందజేసి బాధిత కార్మి కుల కుటుంబాలను ఆదు కోవాలని కోరారు. అర్హతను అనుసరించి వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భవన, ఇతర నిర్మా ణ కార్మిక సంఘం నరస రావుపేట మం డల కార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు. కాగా, శనివారం జరిగిన ప్రమాదంలో మం డలంలోని రావిపాడుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు గుడి వెంకయ్య(40) నరసరావుపేట సమీపంలో తాను పని చేసే భవన సముదాయం వద్దకు వెనుకగా వస్తున్న ఇసుక లారీ పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. అదే గ్రామానికి చెందిన మరో భవన నిర్మాణ కార్మికుడు నూతంగి అబ్రహం(55) శనివారం కూలీలకు బట్వాడా పంపిణీ చేసే నిమిత్తం గ్రామంలోని పెట్రోల్ బం కులో చిల్లర నోట్లు తీసుకొని రోడ్డు దాటు తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు. అబ్రహంకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రాజ్యాంగాన్నే మార్చేదిశగా బిజెపి అడుగులు

సిపిఎం, సిపిఐ ప్రచార భేరీలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్


దుగ్గిరాలలో ప్రచారం భేరి నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశంలో హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించడానికి ఆర్ఎస్ఎస్ ప్రయత్నిస్తోందని, అందుకు బీజేపీ సహకరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. పాత గుంటూరు జెండా చెట్టు సెంటర్లో ఆదివారం సీపీఎం, సీపీఐ సంయుక్త ఆధ్వర్యంలో ప్రచార భేరి బహిరంగ సభను సీపీఐ నాయకులు జంగాల చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్యాస్, పెట్రో ఉత్పత్తులు, నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయడంలో విఫలం అయ్యాయని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వకుండా కేంద్రం తాత్సారం చేయడం సరికాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో బీజేపీ ద్వంద వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. మనువాద సంస్కృతిని కొనసాగించేందుకు రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని తెలిపారు. 8 బడ్జెట్లు ప్రకటించినా రాష్ట్ర అబివృద్ధికి, పోలవరం పూర్తి చేయడానికి నిధులు ఇవ్వకుండా అన్యాయం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ, జనసేన స్పందించడం లేదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రచార భేరి కార్యక్రమాన్ని సీపీఐ, సీపీఎం ఉమ్మడిగా చేపట్టామని రామారావు పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రజా సేవ కంటే కార్పొరేట్ల సేవే ప్రధాన పాలనగా సాగిస్తున్నారని పేర్కొన్నారు. మసీదుల్లో శివాలయాలు ఉన్నాయని వాటిని తవ్వాలని కొత్త ప్రచారాన్ని బీజేపీ నాయకులు చేస్తున్నారని ఆరోపించారు. మతోన్మాద బీజేపీ పాలన నుంచి దేశాన్ని రక్షించడమే లక్ష్యంగా ప్రచార భేరి కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై వామపక్షాలు నిరంతరం పోరాడుతూ ప్రజల పక్షాన నిలబడుతున్నాయన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎల్.అరుణ, సీపీఐ జిల్లా నాయకులు ఘని, నగర కార్యదర్శి మాల్యాద్రి ప్రసంగించారు. సీపీఐ రాయల వెంకటేశ్వర్లు, కట్టా శ్రీను, ఎన్. వెంకటేశ్వర్లు, సీపీఎం నాయకులు కె.శ్రీనివాస్, కార్తీక్ పాల్గొన్నారు.

మంగళగిరి: మతోన్మాద బిజెపిని సాగనంపాలని సిపిఎం, సిపిఐ నాయకులు అన్నారు. ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం–దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో చేపట్టిన ప్రచార బేరి కార్యక్రమంలో ఆదివారం పట్టణంలో సిపిఎం, సిపిఐ పట్టణ కమిటీల ఆధ్వర్యంలో ఇందిరా నగర్‌లో పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగాయా, సిపిఐ నాయకులు పిల్లలమర్రి నాగేశ్వరావులు మాట్లాడుతూ బిజెపి దేశానికి చేసింది ఏమీ లేదని ఆనాడు పోరాడి సాధించుకున్న అనేక కార్మిక, రైతాంగ చట్టాలను బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేస్తుందని విమర్శించారు. ఈనెల 24వ తేదీన మంగళగిరిలో జరిగే భారీ బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని వారు కోరారు. అనంతరం పాదయాత్ర 5,6,8,9,10 వార్డుల్లో కొనసాగింది. ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వై



పెదకాకాని

కమలాకర్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఎం పట్టణ నాయకులు ఎస్ గణేష్, డి రామారావు, కే శ్రీనివాసరావు, టి హేమ సుందర్ రావ్, ఎస్ బాలాజీ, ఎం బాలాజీ, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ నియోజవర్గ నాయకులు జాలాది జాన్ బాబు, కోలా వీరాంజనేయులు, బి మోహన్ రావు పాల్గొన్నారు. **దుగ్గిరాల:** దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ప్రతి వ్యక్తి గొంత్తెత్తి కేంద్ర ప్రభుత్వం దుర్మార్గాలను నిలదీయాలని లేకుంటే మన అందరి భవిష్యత్తు చీకటి మయమైపోతుందని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై. నేతాజి అన్నారు. దుగ్గిరాల మండలంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ప్రారంభమైన రాజకీయ ప్రచార భేరీ యాత్ర ఆదివారం చిలురువూరు అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభించి మాట్లాడారు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉండాల్సిన ప్రజల మధ్య మతవిద్వేషపు చిచ్చు రాజేస్తున్నారని విమర్శించారు. బ్యాంకులు, యల్ ఐసీని, రైల్వే, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని, ఓడరేవులను అధాని అంబానీలకు దారదత్తంచేస్తునారు. ఏమి తినాలో ఏ బట్టలు ధరించాలో బిజెపి ప్రభుత్వం నిర్ణయం చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న వైసీపీ కేంద్రం ఏది అమలు చేయమంటే ఉత్సాహంగా అమలు చేస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు నాయకులు వి సాంబశివరావు , ఎం. నాగమల్లేశ్వరావు, సిపిఐ నాయకులు యస్ కరీముల్లా, బి. చిరంజీవి, యస్ కే.



మంగళగిరి ప్రచార భేరిలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

బాజీ పాల్గొన్నారు. **పెదకాకాని :** సిఐటియు, సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రచార బేరి ప్రచార కార్యక్రమం ఆదివారం స్థానిక సుందరయ్య కాలనీలో కరపత్రాలు పంపిణీ ప్రచార బేరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ మన రాష్ట్రానికి మోడీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంత కాదని ప్రత్యేక హెూదా, పోలవరం నిధులు రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ, ఇవన్నీ పార్లమెంటు



మేడికొండూరు

సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో బురదగుంట సాంబయ్య, కే. రాఘవయ్య, ఏ నాగేశ్వరావు, బి. శ్యామేలు,జె. రాజలక్ష్మి పాల్గొన్నారు. **మేడికొండూరు:** బిజెపి ప్రభుత్వ వ్యతిరేక ప్రచార భేరి సిపిఎం, సిపిఐల ఆధ్వర్యంలో మేడికొండూరు మండలంలో ఎలవర్తిపాడు ,సిరిపురం ,గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తూ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పేరేచర్ల గ్రామంలో కరపత్రాలు పంచుతో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బైర గాని శ్రీనివాసరావు, సిపిఎం మండల కార్యదర్శి బొట్ల రామకృష్ణ తాటికొండ నియోజికవర్గ సిపిఐ నాయకులు శంకరరావు,వై కోటేశ్వరరావు, సిఐటియు మండల అధ్యక్షుడు ఎస్ఎం భాష, సుధాకర్ రెడ్డి, జె.శంకర్రావు, ఎస్.కె మీరసా, చీలీ నాగేశ్వరరావు, నిజాముద్దీన్, డి.ఆంజనేయులు పాల్గొన్నారు


సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ఉపాధి లేక ఎండమావిగా మారిన రాష్ట్రం

తాడేపల్లి:బిజెపి ప్రభుత్వ హయాంలో యువతకు ఉపాధి ఎండమావిగా మారిందిని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం రూరల్ కమిటీ సమావేశం కృష్ణ అధ్యక్షతన తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి ఎనిమిది ఏళ్ల క్రితం మోడీ అధికారంలోకి వచ్చారని చెప్పారు. ఇప్పటి వరకు ఎన్ని కోట్ల మందికి ఉద్యోగాలు కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని దుయ్యబట్టారు. లాభాలు వచ్చే రైల్వేలు, పోర్టులు, ఎల్ఐసి లాంటి సంస్థలను కూడా అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదానీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విచారణ జరపాలని పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు పట్టుబడుతుంటే ప్రభుత్వం ఎందుకు అంగీకరించడంలేదని ప్రశ్నించారు. గవర్నర్ల వ్యవస్థలను అడ్డంపెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రాక ముందు రూ.400 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1200కు పెరిగిందని విమర్శించారు. ఈ నెల 17వ తేదీ నుంచి 25వ తేదీ వరకు రూరల్ గ్రామాల్లో పాదయాత్రలు, గ్రూపు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద మౌలిక వసుతుల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు


అధికారులతో మాట్లాడుతున్న మేయర్

ముస్లిం సోదరులు రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకొనే ఈద్గా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలను నగర పాలక సంస్థ తరుపున కల్పించటం జరుగుతుందని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. రంజాన్ పండుగ రోజున ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకునే ప్రాంతాలైన నగరంపాలెం రోడ్డు రమేష్ హాస్పిటల్ వద్ద ఉన్న ఈద్గా, పాత బస్టాండ్ ఉర్దూ బాయ్స్ స్కూల్లోని ఈద్గా, పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాల వద్ద ఈద్గా ప్రాంతాల్లో ముస్లిం మత పెద్దలతో కలిసి పర్యటించి, రంజాన్ రోజున కల్పించాల్సిన వసతులపై జిఎంసి ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రంజాన్ పండుగ ఏప్రిల్ 22న రానున్నదని, ఈ సందర్భంగా ఈద్గాలకు వచ్చే వారికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈద్గా ప్రాంతాలలో ప్రత్యేక పారిశుధ్య పనులు, జంగల్ క్లియరెన్స్, తాగునీరు, టెంట్లు, కూలర్లు వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా సదరు ప్రాంతాల్లో ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. వసతులన కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారుల్ని ఆదేశించారు. పర్యటనలో మాజీ ఎమ్మెల్యే నంబూరి సుబాని, డిప్యూటి మేయర్ షేక్.సజీల, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మహమ్మద్ అబీద్‌బాష, ఖాజా మొహిద్దీన్ చిష్టీ, షేక్ మీరవాలి, షేక్ మహమూద్, మాజీ డిప్యూటీ మేయర్ షేక్ గౌస్, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణతోనే సరైన చికిత్సలు

సిటీ స్కాన్‌పై అవగాహన సదస్సులో డాక్టర్ జగదీష్

ప్రజాశక్తి -మంగళగిరి



మాట్లాడుతున్న డాక్టర్ జగదీష్‌కుమార్

మారిన జీవన శైలి, తరచుగా జరిగే చిన్న, పెద్ద ప్రమాదాల సందర్భాలలో శరీర భాగాలలో ఏవైనా మార్పులు సంభవించవచ్చునని ,వాటిని నిర్ధాంచేందుకు సిటీ స్కాన్ అవసరం ఎంతో ముఖ్యమని, ప్రముఖ రేడియాలజిస్ట్ టైం డయాగ్నస్టిక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి జగదీష్ కుమార్ అన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్డు వెంబడి గల వైదేహి కళ్యాణ మండపంలో ఆదివారం రాత్రి సిటీ స్కాన్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్ఎమ్‌పి,పిఎమ్‌పి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కోళ్లమూడి హేమసుందర్ అధ్యక్షత వహించారు. జగదీష్ కుమార్ మాట్లాడుతూ మంగళగిరిలో తొలిసారిగా డయాగ్నస్టిక్ సేవలను ఆరంభించామని అన్నారు. విజయవాడ -గుంటూరు నగరాలతో పోల్చితే తక్కువ ధరలకు సిటీ స్కాన్ అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. 24 గంటల పాటు డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని ఫోన్ చేస్తే ఇంటికే వచ్చి రక్త నమూనాలు సేకరిస్తామని అన్నారు. ప్రత్యేకించి సిటీ స్కాన్ దాని ఆవశ్యకతను ఆర్ఎమ్‌పి,పిఎమ్‌పి వైద్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కౌంటర్ శివ నాగేంద్రం ది. మంగళగిరి మండల రిజిస్టర్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె. హేమ సుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోపాల్, కోశాధికారి మల్లేశ్వరరావు, డాక్టర్ పొల్లి నాగేశ్వరరావు, టైం డయాగ్నస్టిక్ పి ఆర్ ఓ పురుషోత్తం పాల్గొన్నారు

రాజధాని పారిశుధ్య కార్మికులపై వేధింపులు మానుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి - **తుళ్లూరు:** రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పై వేధింపులు మానుకోవాలని,లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సిఐటియు జిల్లా కార్యదర్శి వై. నేతాజీ హెచ్చరించారు. ఆదివారం రాత్రి రాజధాని ప్రాంతం తుళ్లూరులోని ప్రజాసంఘాల కార్యాలయంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ సర్దుబాటు పేరుతో అధికారులు పారిశుధ్య కార్మికులను ఊళ్లు తిప్పుతున్నారని, సొంత గ్రామంలోనే కార్మికులకు విధులు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్మికులను పని ఒత్తిడికి గురి చేస్తున్నారని ఆదివారం కూడా పనిచేయమనడం ఏమిటని ప్రశ్నించారు. సచివాలయం ఇతర ప్రాంతాలలో పనిచేసే వారు వారంలో ఐదురోజులు ,పారిశుధ్య కార్మికులు మాత్రం ఏడు రోజులు పని చేయాలనడం సరి కాదన్నారు. కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయించడంలో ఉన్న శ్రద్ధ వారికి రక్షణ పరికరాలు అందించడంలో లేదని విమర్శించారు .కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల ప్రయోజనాలు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు పారిశుధ్య కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులపై వేధింపులు నానాటికీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులపై ప్రశ్నిస్తే ‘ ఉంటే ఉండండి.. లేదంటే పోండి ‘ అంటూ అధికారులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య కార్మికులకు పని భద్రతతో పాటు వేతనం రూ .21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులను అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు.తొలుత కార్మికులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.పెండింగ్ జీతాలు చెల్లించాలని, తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు చేస్తున్న ఆందోళనలలో గ్రామస్తులు భాగ స్వాములు కావాలని డిమాండ్ చేశారు. ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల్లో సాగింది. కార్యక్రమంలో సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్య రాజు,పి.బాబూరావు,షేక్ జానీ,సి హెచ్ సుశీల, సుఖవేణి పాల్గొన్నారు.

నష్టాలబారిన మొక్కజొన్న రైతు

ప్రజాశక్తి-నరసరావుపేట

మొక్కజొన్న రైతులకు అకాల వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. గత మూడేళ్ళుగా మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు ఉధృతితో పూర్తిగా దెబ్బతినడంతో దీని నివారణకు సరికొత్త రసాయనిక ఎరువులు వాడారు. దీంతో, గత ఏడాది మొక్కజొన్న రైతుకు దిగుబడి రావడంతో పాటు ధర కూడా ఆశాజనకంగానే లభించింది. మొక్కజొన్న పైరుకు అనుకూలంగా భూములు ఉన్న యాజమానులు ఈ ఏడాది కౌలు ధర పెంచినప్పటికీ అధిక సంఖ్యలో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. అయితే, ఈ ఏడాది మార్చిలో కురిసిన అకాల వర్షం కారణంగా, పంట చేతికి అందే సమయంలో పూర్తిగా నేల వాలడంతో మొక్కజొన్న రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. మొదటి వర్షాలకు నేల వాలైనప్పటికీ దిగుబడులు, గింజ నాణ్యతపై దిగులు చెందని రైతులు, వరుస అకాల వర్షాలతో దెబ్బతిన్నారు. కండెలు కూడా నీట మునిగి, మొక్క నుండి విడిపోవడం, మట్టిలో కలవడంతో రంగు మారి నాణ్యత కూడా దెబ్బతిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మొక్కజొన్న మిషన్‌తో కోత కోయగా నేల వాలిన కండెలు మిషన్‌కు అందకపోవడంతో అదనంగా కూలీ డబ్బులు వెచ్చించి మొక్కజొన్న కర్రల మధ్య ఉన్న కండెలను వెతుకులాడి కుప్ప వేసుకుంటున్నారు. దీంతో ఎకరాకు రూ.5 వేలు నుండి రూ.6 వేల వరకు అదనంగా ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. గింజ నాణ్యత లేకపోవడంతో కొనేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. అకాల వర్షాలు రైతుకు తీరని ఆవేదన మిగిల్చిందని, పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని, కౌలు రైతు పరిస్థితి మరింత దిగజారిందని వారు చెబుతున్నారు.



ఇక్కుర్తి గ్రామంలోని పొలంలో మొక్కజొన్న కండెలు వెతికి ఏరుతున్న కూలీలు



కల్లంలో ఆరబోసిన మొక్కజొన్న



నాణ్యత లేని కండెలు చూపి ఆవేదన వ్యక్తం చేస్తున్న మహిళా రైతు



లింగాపురంలో రూ.16.3 కోట్లతో పనులు

ప్రజాశక్తి-అమరావతి

ప్రజల సమస్యలు తీర్చి సంక్షేమం అందించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే అమరావతి మండలం లింగాపురంలో ఆదివారం పర్యటించారు. గడప గడపకు వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సంక్షేమ పథకాల అందుతున్న తీరును తెలుసుకున్నారు. సమస్యలు ఏవైనా ఉన్నాయి ప్రత్యేకంగా అడిగి వాటి పరిష్కారానికి అక్కడికక్కడే సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ లింగాపురంలో రూ.16.3 కోట్లతో అభివృద్ధి చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని చెప్పారు.

ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయి

- వివేక హత్య కేసులో తాడేపల్లికి లింకులు
- కోడికత్తి కేసు జగన్ ఆడిన డ్రామా
- మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విశాఖపట్నంలో వైఎస్ జగన్‌పై కోడికత్తితో దాడి, మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య చేసిన ఘటనలో వాస్తవాలు ప్రజలు గ్రహిస్తున్నారనిమాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. కోడికత్తి కేసులో టిడిపిపై ఎన్నో ఆరోపణలు చేసి ఎన్నికల్లో లబ్ధిపొందారని తెలిపారు. వివేకానంద రెడ్డి హత్య కేసులో కూడా టిడిపిపై ఆరోపణలు చేసి రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదని సిబిఐ విచారణ కోరిన జగన్ ఇప్పుడు సిబిఐపైనే ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ తమ్ముడు అవినాష్ రెడ్డి, బాబాయ్ భాస్కరరెడ్డి పాత్ర ఉందని ఇప్పటికే నిర్ధారణ అయిందన్నారు. అలాగే ఈ కేసులో కీలక అంశాలతో తాడేపల్లి ప్యాలెస్‌కు లింకులు ఉన్నాయని ఆయన తీవ్ర స్థాయిలో ఆరోపించారు. ఈ రెండు కేసులో పెద్ద డ్రామా ఆడి చంద్రబాబుపై లేనిపోని ఆరోపణలు చేసి ఎన్నికల్లో ప్రజల సానుభూతి పొందారని కానీ ఇప్పుడు మొత్తం ఘటనలకు ఎవరు కారకుల్లో ప్రజలకు వాస్తవాలు తెలుస్తున్నాయని తెలిపారు. వివేకా హత్య కేసులో సిబిఐపై కూడా దాడి చేసి హంతకులను తప్పించడానికి ప్రయత్నించారని అన్నారు. వివేకా కూతురు డాక్టర్ సునీత సుప్రీంకోర్టులో కూడా పోరాడి ఈ కేసును తెలంగాణకు బదిలీ చేయించారని అన్నారు. ఇప్పటికైనా జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలపై మేధావులు, సమాజం గమనించాలని కోరారు. వైసిపి ప్రభుత్వంలో నాశిరకం మద్యం వల్ల గత నాలుగేళ్లకాలంలో 14వేల మంది మృతి చెందారని, ఎన్నో వేల మంది అనారోగ్యం పాలయ్యారని తెలిపారు. గురజాల నియోజకవర్గంలో వైసిపి నేతల చేతుల్లో 11 మంది హత్యకు గురయ్యారని తెలిపారు. వీరి కుటుంబాలకు టిడిపి అండగా నిలిచిందన్నారు. కాసు మహేష్ రెడ్డి ఆధ్వర్యంలో అక్రమ మైనింగ్ యధేశ్ఛగా సాగుతుందన్నారు.

పేద కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

స్థానిక జీవి మాధవరావు కార్యాలయం నందు నందు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో సమావేశం జరిగినది. ఈ సందర్భంగా పలువురు బ్రాహ్మణ నీరు పేదలకు బియ్యం, నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఇటీవల మరణించిన ప్రముఖ ఆడిటర్, బ్రాహ్మణ సేవా సమితి వ్యవస్థాపకులు మంత్రిరాజు వెంకటరావు , ప్రముఖ దాత చింతలపూడి రమాదేవి రెండు నిముషములు మౌనం పాటించి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో 8 కుటుంబాలకు బియ్యం,నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం అన్నా ప్రగడ వెంకటేశ్వర రావుకు సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.





హామీల్లో 90 శాతం అమలు : మంత్రి అంబటి

తప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్

ప్రజలకు ఇచ్చినహామీలన్నీ 90 శాతం ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేశారని ప్రజలుప్రభుత్వం పట్ల విశ్వాసంతో వున్నారని రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికలు ఇంకా ఏడాది వుండగానే ప్రజల ముంగిటకు నాయకులను పంపి ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.2 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లోకి పం పిన ఘనత జగన్‌కే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని పూర్తి చేసిన నాయ కులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సి హెచ్ సాంబశివరావు, బి.లింగారెడ్డి పాల్గొన్నారు .

చాక్లెట్ ఇచ్చి నక్లెస్ ఎత్తుకెళుతున్నారు: కన్నా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - వినుకొండ

స్వార్ధంతో పార్టీ పెట్టి, ప్రజలను మోసగించి, తండ్రి ఆశయాలకు తూట్లు పొడిచిన వ్యక్తి వైఎస్ జగన్ అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ విమర్శించారు. వైసిపికి చెందిన స్థానిక 6వ వార్డు కౌన్సిలర్ భర్త గ్రంథం కోటేశ్వరరావు, వారి సోదరులు సుబ్బారావు ఆదివారం టిడిపిలో చేరారు. వీరితో పాటు పట్టణంలోని పులగం శ్రీను, తుంగ వెంకట్, కారుపల్లి శ్రీను, కోలా సత్యం, బాల, కుడుముల వెంకటేశ్వర్లు, సిద్దు, మద్దుల హరి, గోపి, కొయ్యల రాంబాబు, సంజీవరావు, చేజర్ల మల్లికార్జునరావు, అడపాల శేఖర్, బోసు, విశ్వం, చిట్టి నాగేశ్వరరావులతోపాటు మరో 24 కుటుంబాలు టిడిపిలో చేరాయి. మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా స్థానిక గంగినేని కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజ రయ్యారు. కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఇసుక, మద్యం లాంటి మాఫియాలే కాకుండా లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేస్తూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని ముఖ్యమంత్రి జగన్‌పై ఆరోపణలు చేశారు. సంక్షేమం పేరుతో ప్రజలకు ఒక చేత్తో చాక్లెట్ ఇచ్చి నక్లెస్ ఎత్తుకెళుతున్నారని విమర్శించారు. ప్రజల జేబులు కొట్టేస్తున్న ఇలాంటి వ్యక్తులను రాష్ట్రం నుంచి పారద్రోలాలని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబునాయుడు మళ్లీ అధికారంలోకి రావాల్సిందేనని అన్నారు. పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వైసిపి అవినీతి,అక్రమాలు,అరాచకాలు, దౌర్జన్యాలు తట్టుకో లేక ఆ పార్టీ శ్రేణులు టిడిపిలో చేరుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో టిడిపిలో చేరికలు కొనసాగుతూనే ఉంటాయని చెప్పారు.



'చదలవాడ.. అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయం'

ప్రజాశక్తి-నరసరావుపేట

రాబోయే ఎన్నికల్లో నరసరావుపేట నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగుర వేయడం,డాక్టర్ చదలవాడ అరవిందబాబు అసెంబ్లీలో అడుగు పెట్టడం ఖాయమని టిడిపి నేత మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయానికి ఆయన వచ్చారు. శనివారం పుట్టినరోజు వేడుకలు జరుపుకున్న అరవిందబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. లక్ష్మీ నారాయణ మాట్లాడారు.



సమన్వయంతో పని చేయండి

కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పెదకూరపాడు

తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాశ్ నారాయణ, రాజశేఖర్ అన్నారు. నియోజకవర్గ స్థాయి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జిల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, యూనిట్ ఇన్‌ఛార్జిలు, పోలింగ్ బూత్ ఇన్‌ఛార్జిలతో కలిపి సమావేశాలు ఏర్పాటు చేయడం, తీసుకున్న నిర్ణయాలపై కలిసి పని చేయా లన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కానుందని, ఓటర్లను చైతన్య పం చాలని సూచిం టచారు. కార్యక్రమంలో బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు, అమ రావతి, పెద తoకూరపాడు మండల నాయకులు ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ముగిసిన వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టరేట్‌లో రెండ్రోజులపాటు ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ రెండోరోజు ఎస్ఆర్ శంకరన్ హాలు వద్ద ఏర్పాటు చేసిన వైద్య పరీక్షల కౌంటర్లను కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డిఆర్‌ఓ చంద్రశేఖర్‌రావుతో కలిసి పరిశీలించారు. వైద్య పరీక్షలకు వచ్చిన ఉద్యోగులతో కలెక్టర్ మాట్లాడుతూ డాక్టర్లు సూచించిన వైద్యాన్ని క్రమం తప్పక పాటించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి స్పెషలిస్ట్ డాక్టర్ల ద్వారా ప్రిస్క్రిప్షన్ అందించినట్లు చెప్పారు. పన్నెండు వందల మంది ఉద్యోగులకు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, ఈసిజి, ఎకో టెస్ట్, కంటి పరీక్షలు, ఇఎన్‌టి, పాప్ స్మీయర్, దంత పరీక్షలు, మమోగ్రామ్ వంటి 8,056 పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. టెస్ట్‌లు అయిన వారికి ట్రీట్మెంట్ చేసి మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. మెడికల్ క్యాంపులో వైద్యసేవలు అందించిన జి.జి.హెచ్, మణిపాల్ వైద్యశాల, లలిత సూపర్ స్పెషాలిటీ వైద్యశాల, కాటూరి మెడికల్ కళాశాల, ఆదిత్య వైద్యశాల, శ్రీ హాస్పిటల్, డా.ఆగర్వాల్ కంటి వైద్యశాల, ప్రత్యూష డెంటల్, స్మైల్ డెంటల్, కాశ్వీ డెంటల్ వైద్యశాల స్పెషలిస్ట్ డాక్టర్లకు, యాజమాన్యాలకు అయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ అసోషియేషన్ అధ్యక్షులు, ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సర్వీసుకు సంబంధించిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక గ్రీవియన్స్ నిర్వహించటంతో పాటు, ఉద్యోగుల ఆరోగ్య భద్రత దృష్ట్యా హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించిన గుంటూరు కలెక్టర్ ఉద్యోగుల పక్షపాతి అని కొనియాడారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యం.వెంకటశివరామిరెడ్డి, జి.జి.హెచ్ పర్యవేక్షకలు డాక్టర్ ప్రభావతి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ జయరామ కృష్ణ, గుంటూరు పశ్చిమ మండల తహశీల్దార్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు


అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కొనసాగిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

అంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన అగ్నిమాపక సేవలు శాఖ పొన్నూరు వారి ఆధ్వర్యంలో ది14 నుండి 20వతేది వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించుచున్నారు. ఈ వారోత్సవాలలో భాగంగా పొన్నూరు టౌన్‌లోని నీలి శెట్టి ఎనక్లేవ్‌లో గ్యాస్, ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాల గురించి ప్రజలకు డెమో కార్యక్రమం ద్వారా పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్రాధికారి కే. ప్రసాద్ రావు , పొన్నూరు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి -మంగళగిరి

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మంగళగిరి అగ్నిమాపక అధికారులు టిడ్కో గృహ సముదాయంలో అగ్ని ప్రమాద నివారణ పై అవగాహన కల్పించారు. ప్రమాదాల జరిగేటప్పుడు ఎలా నివారించాలో మంగళగిరి అగ్నిమాపక అధికారి వై వెంకటేశ్వర్లు వివరాలు తెలిపారు.

గాయకుడు వెంకటసుధాకర్‌కు ఎన్‌టిఆర్ సత్కారం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సినీ మాటలు రచయత బుర్రా సాయి మాధవ్ నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ శక పురుషుని శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతి శనివారం, ఆదివారం ఎన్‌టిఆర్ వ్యక్తిత్వంపై, నటించిన సినిమాలపై, ఆయన రాజకీయ జీవితంపై జరిగే సదస్సును కొత్తపేట పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో శనివారం నిర్వహించారు. కళాకారులను సన్మానించే కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కళాకారుడు, గాయకుడు మామిడి వెంకట సుధాకర్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించి ఎన్‌టిఆర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో వక్తలు బొప్పన ప్రవీణ్ కుమార్, గుమ్మడి భావనాచౌదరిలు బహుజనులు కోసం ఎన్‌టిఆర్ సంస్కరణలు అనేఅంశంపై ప్రసంగించారు. అనంతరం వక్తలనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, పెండేల వెంకటరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, పరుచూరి రమ్య, సత్యవతి, గుమ్మడి వాణి సరోజా లక్ష్మీ నాగమణి, కంచర్ల ఏడుకొండలు పాల్గొన్నారు.


వెంకట సుధాకర్, ప్రవీణ్ కుమార్, భావనాచౌదరి లను సత్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

పట్టణం 27వ వార్డుకు చెందిన మొహిద్దీన్ జ్యూయలర్స్ షేక్ హుస్సేన్ పేద ముస్లిం సోదరులకు రంజాన్ తోఫాను టిడిపి సీనియర్ నాయకులు సంగం డెయిరి చైర్మన్ దూళిపాళ్ల నరేంద్ర కుమార్ చేతుల మీదగా పంపిణీ చేశారు. రంజాన్ తోఫాలో గోధుమ పిండి, స్యేమియా, కందిపప్పు, పచ్చిశనగపప్పు, పంచదార, బెల్లం, ఉల్లిపాయలు, పలావు మసాలా దినేసలు, సగ్గ బియ్యం, నూనె, దుప్పటి కలిపి 11 రకాల వస్తువులను 250 మందికి పైగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మొహిద్దీన్ జ్యూయలర్స్ ప్రొ షేక్ హుస్సేన్ , పొన్నూరు పట్టణ అధ్యక్షులు పఠాన్ అహ్మద్ ఖాన్, పొన్నూరు నియోజిక వర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు పఠాన్ ఫైరోజ్ ఖాన్ , మండల పార్టీ అధ్యక్షులు బి. బాబురావు, యమ్.డి గౌస్, యమ్. డి రహంతుల్లా, షేక్ సీలర్ బాషా,షేక్ బాబ్జి, షేక్‌బక్షి, టి.లక్ష్మీనారాయణ చౌదరి,షేక్ కరిముల్లాబాజి, అర్.వరప్రసాద్, టి.రవి, పాల్గొన్నారు.


బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్:ఎంటిఎంసీ పరిధిలోని మెల్లంపూడి గ్రామానికి చెందిన కొరివి సమాధానం గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆదివారం బాధిత కుటుంబానికి స్థానిక వైసిపి నాయకుల ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని సమాధానంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామ నాయకులు బొమ్మరెడ్డి రాజారామిరెడ్డి, ఈదులమూడి శేఖర్, రామకృష్ణారెడ్డి, ఉయ్యూరు శివరామిరెడ్డి, సునీల్, నాగేశ్వరరావు, పఠాన్ షేర్ ఖాన్, ఈదులముడి ప్రభుదాసు పాల్గొన్నారు.

మంగళగిరి: పట్టణంలోని హుడా కాలనీ చెందిన షేక్ మౌలాలికి ఎమ్మెల్యే ఆర్కే రూ. 10వేలు ఆర్థిక సహాయాన్ని వైసిపి నాయకులు ఆదివారం అందజేశారు. మౌలాలి భార్య అనారోగ్యానికి గురయ్యారు. మౌలాలి దివ్యంగుడిగా ఉన్నాడు. ఆర్థిక సహాయం కావాలని ఎమ్మెల్యేని కోరిన వెంటనే స్పందించి సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండి ఫిరోజ్, సంకె సునీత పాల్గొన్నారు.


విరేశలింగ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఘనంగా కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు

ప్రజాశక్తి, పెదనందిపాడు

తెలుగులో తొలి నవల రచయిత, తెలుగు జాతి నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త అయిన కందుకూరి వీరేశలింగం పంతులు జీవితం ప్రజలందరికీ ఆదర్శనీయమని ఎస్టియు గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షులు గేరా మోహనరావు పేర్కొన్నారు. వీరేశలింగం పంతులు 175 వ జయంతి సందర్భంగా ఆదివారం పెదనందిపాడు శాఖా గ్రంధాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రంధాలయ నిర్వహకురాలు పి.సుభాషిని అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు గారపాటి రమేష్, ఎస్టియూ నాయకులు సుబ్బారావు, సద్గుణ రావు, గేరా గణేష్, కే పుష్పవతి, మంజుల, వంశి తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయం


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యే ఆర్కే

ప్రజాశక్తి- దుగ్గిరాల:మానవ సేవా సంస్థ పేద ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అనేక మంది వక్తలు కొనియాడారు. మండలంలోని ఈమని గ్రామంలో ఆదివారం ఆ సమస్థ ఆధ్వర్యంలో జరిగిన మెగా కంటి వైద్య శిబిరంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో మన బ్రతికే కాకుండా ఇతరుల అభివృద్ధి కోసం పనిచేయటం మానవతా దృక్పథంతో కూడిన అంశమని కితాబునిచ్చారు. మరో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు,ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిలు మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఉండేలా గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు కొనసాగించడం అభినందనీయమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు వంగర సురేష్ మాట్లాడుతూ ప్రస్తుత మెడికల్ క్యాంపులో ఫ్రీ చెకప్‌తో పాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. అర్హులైన వారందరికీ ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేస్తామన్నారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో దాదాపు 700 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పిటిసి మేకతోటి అరుణ, సర్పంచ్ సిద్దెల శ్రీవాణి, ఉజ్వల హరిణి, పాల్గొన్నారు.


సావనీరు ను ఆవిష్కరిస్తున్న సాయి ప్రసాద్ తదితరులు

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -మంగళగిరి

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడానికి పాలక పార్టీలు కృషి చేయాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెవిఎస్ సాయిప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని గోపాలకృష్ణ థియేటర్ సమీపంలో గల ఆస్పత్రిలో ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర సావనీరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం గురించి పాలక పార్టీలు పట్టించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. విద్యా, వైద్య రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని కోరారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య వేదిక మంగళగిరి డివిజన్ నాయకులు డాక్టర్ వంశీకృష్ణ, విజయ్, ఎం నాగేశ్వరావు, రాజేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు జె.వి. రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, బాలకృష్ణ, ఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో అసైన్డ్ రైతు మృతి

ప్రజాశక్తి - తుళ్లూరు


కంతేటి ఏడుకొండలు(ఫైల్)

రాజధాని ప్రాంతం తుళ్లూరు దళితవాడకు చెందిన అసైన్డ్ రైతు కంతేటి ఏడుకొండలు (56) గుండెపోటుతో శనివారం రాత్రి మృతి చెందాడు.ఏడుకొండలు రాజధాని నిర్మాణానికి రెండు ఎకరాల భూమిని లాండ్ పూలింగ్‌లో ఇచ్చాడు. అమరావతి ఉద్యమంలో ఏడుకొండలు చురుగ్గా పాల్గొన్నాడు .అసైన్డ్ రైతులకు కౌలు చెల్లించాలంటూ ఇటీవల జరిగిన ఆందోళనలోనూ ఏడుకొండలు భాగస్వామి అయ్యాడు. ఏడుకొండలు మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్,మాజీ జెడ్పిటిసి దామినేని శ్రీనివాసరావు, కాటా అప్పారావు, అమరావతి దళిత మహిళా జెఎసి కన్వీనర్ అంకం సువర్ణ కమల,దళిత బహుజన జెఎసి కన్వీనర్ చిలకా బసవయ్య విచారం వ్యక్తం చేశారు.

1216వ రోజుకు అమరావతి ఆందోళనలు..

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలంటూ రైతులు,మహిళలు,వ్యవసాయ కార్మికులు చేస్తున్న ఆందోళనలు ఆదివారంతో 1216వ రోజుకు చేరాయి. వెంకట పాలెం, తుళ్లూరు, నెక్కల్లు,అనంతవరం తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి. అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి జై అమరావతి అంటూ నినాదాలు చేశారు.



చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

బాటసారులు, వాహనదారుల వేసవి దాహార్తిని తీర్చాలనే సదుద్దేశ్యంతో స్థానిక యువత ఆధ్వర్యంలో ఆదివారం యర్రబాలెం శివాలయం ఎదుట చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తొలి రోజు బాటసారులకు, వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుండాల సాయి, కాపరౌతు సుందరయ్య, భీమవరపు నాగరాజు, లేళ్ల నరసింహారావు, భీమవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటిని నెలాఖరు వరకూ ఇవ్వాల్సిందే



ప్రజాశక్తి-క్రోసూరు

సాగర్ జలాలను సాగు అవసరాల కోసం ఈ నెలాఖరు వరకూ విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రైతు, కౌలురైతు సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని దొడ్లేరులో ఆదివారం నిరసన చేపట్టారు. రైతు సంఘం జిల్లా నాయకులు ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ రబీలో సాగైన పంటలు చివరి దశలో ఉన్నాయని, ఇప్పుడు సమృద్ధిగా నీరుంటేనే రైతు చేతికి పంట దక్కుతుందని చెప్పారు. లేకుంటే దిగుబడులు పడిపోయి రైతులు నష్టాల పాలవుతారని అన్నారు. నీటి కోసం శనివారం ఆందోళన చేస్తున్న వారిని అరెస్టులు చేయడాన్ని ఖండించారు. వారిపై కేసులు ఎత్తివేయాలన్నారు. కౌలురైతు సంఘం మండల కార్యదర్శి టి.హనుమంతరావు మాట్లాడుతూ రైతుల నిరసన నేపథ్యంలో నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు వారం రోజులు మాత్రమే నీటి విడుదల చేస్తానని చెప్పడం సరైంది కాదన్నారు. ఈ నెలాఖరు వరకూ ఇచ్చి తీరాలని కోరారు.

ఇఫ్తార్ విందులో డిప్యూటీ సిఎం



మాట్లాడుతున్న అంజాద్‌బాషా

ప్రజాశక్తి-తెనాలి

రంజాన్ మాసంలో సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అంజాద్‌బాషా అన్నారు. స్థానిక వహాబ్ రోడ్డులో జెబి స్టీల్స్ అధినేత షేక్ జిలాని, సిటి స్కాన్ అధినేత మహ్మద్ రియాజ్‌ఖాన్ ముస్లిమ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో వహాబ్‌రోడ్డులో ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్టార్ విందులో డిప్యూటీ సిఎం ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేదలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రితో పాటు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదానశీం ప్రసంగించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, సబ్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఎస్పీ కె.స్రవంతిరాయ్, ఎస్ఎమ్‌డి జియాఉద్దీన్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ జిలానిబాషా, కౌన్సిలర్స్ దుబాయ్‌బాబు, మొఘల్‌రహ్మత్ భేగ్ పాల్గొన్నారు.

పాలీసెట్, ఎపిఆర్‌జెసికి ఉచిత శిక్షణ

- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు కోసం యుటిఎఫ్ కార్యాలయాల్లో సేవా కేంద్రాల ఏర్పాటు
- 20వ తేదీ నుండి ఉచిత శిక్షణ ప్రారంభం



వినుకొండలో సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అప్పరాజు నాగేశ్వరరావు

ప్రజాశక్తి - వినుకొండ

ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం హెల్ప్‌లైన్ సెంటర్‌ను పట్టణంలోని యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని సీనియర్ నాయకులు అప్పరాజు నాగేశ్వరావు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. యుటిఎఫ్ వినుకొండ ప్రాంతీయ కార్యాలయం ఉపాధ్యాయ ఉద్యమాలకు నిలయంగానే కాకుండా అనేక సామాజిక, సాంఘిక సేవా కార్యక్రమాలకు నిలయంగా ఉంటుందని చెప్పారు. గత విద్యా సంవత్సరంలో నిర్వహించిన ఉచిత శిక్షణ శిబిరంలో పదుల సంఖ్యలో విద్యార్థులు ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్ కళాశాలలకు ఎంపికయ్యారని గుర్తు చేశారు. ఈ ఏడాది సైతం కల్పిస్తున్న అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో వినుకొండ ప్రాంతాన్ని మరింతగా ముందంజలో ఉంచాలని కోరారు. అనంతరం జిల్లా కార్యదర్శులు ఎం.రవిబాబు, ఆర్.అజయ్‌కుమార్ మాట్లాడారు. సీనియర్ నాయకులు ఇ.వెంకటరెడ్డి, జి.సాంబశివరావు, జి.నాగేంద్రుడు, సిఐటియు నాయకులు బి.వెంకటేశ్వర్లు, పిఎ జిలానీ, జి.రామారావు, బి.భాస్కర్, వినుకొండ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టివి హనుమంతుసూరి, పి.రమేష్‌బాబు, డి.మస్తాన్ సిహెచ్.మల్లికార్జున, సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పిడుగురాళ్ల

ఎపిఆర్‌జెసి, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలకు ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్, డివైఎఫ్ఐ, జెవివి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణిస్తామని, దీంతోపాటు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి సేవా కేంద్రాన్నీ ఏర్పాటు చేశామని నాయకులు తెలిపారు. ఈ మేరకు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకర్లకు వివరాలను వెల్లడించారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారధి మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసిన వారు పాలిటెక్నిక్, ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షలకు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలంటే ఉదయం 10 గంటల నుండి రాత్రి ఏడు గంటలకు వరకు పిడుగురాళ్లలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. 18వ తేదీ వరకూ ఈ సేవా కేంద్రం ఉంటుందని చెప్పారు. 20వ తేదీ నుండి ఉచితంగా శిక్షణనూ ప్రారంభిస్తామని, అన్నారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా అధ్యక్షులు కోట సాయికుమార్ మాట్లాడుతూ ఉచిత శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. వివరాలకు ఎంవి సాంబశివరావు : 9949934068, ఇ ఆంజనేయరాజు : 9573067224, కోట సాయికుమార్ : 7799334980 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. సమావేశంలో యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ 4జి సేవలు మరింత విస్తృతం



- సిగ్నల్ వ్యవస్థ మెరుగుదలకు చర్యలు
- సెల్ టవర్లను పెంచుతాం
- ప్రజాశక్తితో బిఎస్ఎన్ఎల్ జీఎం శ్రీధర్



టెలికం రంగంలో పోటీని తట్టుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు భారత్ సంచార్ నిగం లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్) జనరల్ మేనేజర్ ఎస్.శ్రీధర్ చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వినియోగదారుల సంఖ్యను పెంచుకుంటూ బ్రాడ్‌బాండ్ సేవలను విస్తృత పరుస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో తమ సంస్థ ద్వారా చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.



సిగ్నల్స్‌ను పెంచటానికి తీసుకుంటున్న చర్యలు?

బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఇంకా పెంచి, సిగ్నల్ కవరేజి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండే అందే పథకాలు ఫోన్‌కు లింకు అయి ఉన్నందున గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సామర్థ్యాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా గ్రామ సచివాలయాలు, పిహెచ్‌సిలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సిగ్నల్ సమస్య ఉన్నట్టు మా దృష్టికి వచ్చింది. ఇందువల్ల ప్రజలకు సకాలంలో ప్రభుత్వం సంక్షేమ పథకాలను పొందడానికి ఇబ్బందిగా ఉందని ప్రజా ప్రతినిధులు, పలువురు సభ్యులు ఫిర్యాదు చేశారు. వీటిపై వెంటనే చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో 4జి సేవలు ఎప్పటి నుంచి ఇస్తారు?

ప్రస్తుతం 4జి సర్వీసులు ఇస్తున్నాం. జిల్లాలో మొత్తం 380 టవర్లు ఉన్నాయి. ఇందులో 4జి టవర్లు 105 ఉన్నాయి. కొత్తగా 4జి సర్వీసులు ఇంకా రాబోతున్నాయి. ఆత్మనిర్భర్ ప్రాజెక్టు కింద కొత్త లైన్లు ఏర్పాటు చేస్తున్నాం. 77 టవర్లు హై స్పీడ్‌తో 4జీ సేవలను అందించేందుకు సన్నాహాలు చేస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం యుఎస్‌వో ఫండ్ ద్వారా 4జి టవర్లు ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది.

ఏ నెట్‌వర్కూ లేని ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ ఉంటుందా?

ఏ నెట్‌వర్క్ టవుర్లూ లేని ప్రాంతాలను గుర్తిస్తున్నాం. ఈ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేసి సర్వీసులను ప్రారంభిస్తాం. తద్వారా కొత్త వినియోగదారులను ఆకర్షించగలుగుతాం. ఇలాంటి ప్రాంతాలు ఇప్పటి వరకు మూడు గుర్తించాం. ఇప్పటికే అయ్యన్నపాలెం, కెపి.గూడెంలో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్కు మాత్రమే ఉంది. కొత్తగా 77 టవర్లు ఏర్పాటుకు భూసేకరణ చేస్తున్నాం. అవసరమైన చోట భూమి కొనుగోలు చేసి టవర్లు ఏర్పాటు చేస్తున్నాం.

జిల్లాలో మొబైల్ కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

జిల్లాలో 5.06 లక్షల ప్రీపెయిడ్ కనెక్షన్లు ఉన్నాయి. జియో, ఎయిర్‌టెల్, ఇతర నెట్ వర్కుల కనెక్షన్లు మరో 20 లక్షల వరకు ఉండవచ్చు. కొంత మంది ఒకటి నుంచి నాలుగు నెంబర్లు వరకు వినియోగిస్తున్నారు. అందువల్ల ఇతర నెట్‌వర్కులకు చెందిన కనెక్షన్లు ఎక్కువగా ఉండవచ్చు. మొత్తంగా 90 శాతం ప్రీపెయిడ్ కనెక్షన్లు ఉన్నాయి. బిఎస్ఎన్ఎల్ 20 వేల ల్యాండ్‌లైన్ కనెక్షన్లు, 19,500 బ్రాడ్‌బాండ్ కనెక్షన్లు ఉన్నాయి. కేబుల్ నెట్‌వర్కు కనెక్షన్లు 3,800 వరకు ఉన్నాయి. 2022-23లో రూ.67 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24లో రూ.80 కోట్ల ఆదాయం రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

బ్రాండ్‌బాండ్ కనెక్షన్లను ప్రైవేటు వారు నిర్వహిస్తారా?

ప్రైవేటు సంస్థలు, బిఎస్ఎన్ఎల్ చెరి సగం ఆదాయం పొందేలా రాష్ట్రంలో కొన్ని సంస్థలతో ఒప్పందం జరిగింది. టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ (టిప్) ద్వారా ప్రైవేటు సంస్థలు నిర్వహించి ఆదాయం చెరి సగం తీసుకునేలా ఒప్పందం చేసుకున్నాం.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఎపిజిఇఎ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా

ప్రజాశక్తి-గుంటూరు

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా అన్నారు. స్థానిక సంఘం కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ ఏ ప్రభుత్వ విభాగంలో చూసినా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉన్నారని, రోజురోజుకీ వారిపై పనిభారం పెరుగుతోందని చెప్పారు. అయితే వారికి కనీస వేతనాలు అమలు చేయడం లేదని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తగిన వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. ఒకే చోట, ఒకే పనికి రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల మధ్య వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉండడం బాధాకరమన్నారు. ఒకే విద్యార్హతతో ఒకే పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతన వ్యత్యాసాలు లేకుండా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును ప్రభుత్వమే అమలు చేయకపోతే ఇంకెవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పోరాటాల ద్వారా హక్కులు, సమాన వేతనం సాధించుకునేందుకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కరిముల్లా షాఖాదరి, ఉపాధ్యక్షులు మహేష్‌బాబు, హుస్సేన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసరావు, నగర ఉపాధ్యక్షులు రాధాకృష్ణ పాల్గొన్నారు.